క్లుప్తంగా

నీటి ఎద్దడిని పరిష్కరిస్తాం

– ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో నీటి ఎద్దడి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మండల పరిషత్ నిధుల ద్వారా ట్యాంకర్‌తో నీటిని అందించాలని ఆదేశాలు జారీ చేశారు. సత్వరమే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ట్యాంకర్ ద్వారా నీటిని ప్రజలకు అందించే విధంగా నాయకులు చొరవ తీసుకున్నారు. సత్వరమే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కాసును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొమ్మినేని బుజ్జి, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్ , చిలకపాటి బ్రహ్మయ్య, బ్రహ్మం, తదితరులున్నారు.

వైభవంగా శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

మాచవరం : మండలంలోని వేమవరం గ్రామ బస్టాండ్ సమీపంలో శ్రీ అభయాంజనేయ స్వామి 31 అడుగుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా వేద పండితులచే శాంతి హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించద్దు



గురజాల : విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం వహించవద్దని నోడల్ డిప్యూటీ కమీషనర్ కె హేమంత్ నాగరాజు సూచించారు. మే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అంతరాష్ట్ర చెక్‌పోస్టు అయిన పొందుగులలో వాహనాలు తనిఖీ చేయాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే వదిలి పెట్టాలన్నారు. అనధికార మద్యం విక్రయాలు, అక్రమ మద్యం నిల్వలు, గోడౌన్‌ల సమాచారం సేకరించాలని ఆదేశించారు. అనధికారికమైన మద్యం కేసుల్లో పట్టుబడిన నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. మద్యం ప్రభావం ఎన్నికలపై పడకూడదన్నారు. సెబ్ సిబ్బంది వారి విధులు సమర్థవంతంగా నిర్వహించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సీఐ ఎన్ వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు 3 నామినేషన్లు

గురజాల : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణలో రెండో రోజు 3 నామినేషన్లు దాఖలైనట్లు రెవెన్యూ డివిజన్ అధికారి , ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణాకాంత్ రెడ్డి తెలిపారు. తెలుగుదేశం పార్టీ తరపున యరపతినేని శ్రీనివాసరావు నామినేషన్ పత్రాలను ఆ పార్టీ ప్రతినిధులు దాఖలు చేయగా, యరపతినేని రమేష్ బాబు ఒక నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా చర్లగుడిపాడు గ్రామానికి చెందిన కోయా రామారావు నామినేషన్ పత్రాలు అందించారన్నారు.

గ్రామ గుర్తింపు చిహ్నం ధ్వంసం



గురజాల : గ్రామ గుర్తింపు చిహ్నంను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. గురజాలలోని నాయకురాలు నాగమ్మ కాలం నాటి దూబ చెరువు నూతన నగర పంచాయతి పాలక వర్గం రూపురేఖలు మార్చి వాకింగ్ ట్రాక్, పిల్లల పార్కు జిమ్ వంటి వాటిని ఏర్పాటుచేసి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చింది. దూబ చెరువు ఎంట్రన్స్ గేటు వద్ద ఐ లవ్ గురజాల పేరుతో లైటింగ్ బోర్డును పార్కుకు వచ్చిన వారు కుటుంబ సభ్యులతో ఫోటోలు దిగేందుకు అనువుగా ఏర్పాటుచేశారు. నేడు ఆ ప్రాంతాన్ని గుర్తుతెలియని దుండగులు పూర్తిగా ధ్వంసం చేశారు. ఆకతాయిలు పనా లేదా కావాలనే ఎవరైనా ధ్వంసం చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించండి

పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

దుర్గి : రానున్న ఎన్నికల సందర్భంగా ప్రజలు వివాదాల జోలికి వెళ్ళకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని పల్నాడు జిల్లా ఎస్పి బిందుమాధవ్ కోరారు. శుక్రవారం మండలంలోని అడిగొప్పల, ధర్మవరం, జంగమహేశ్వరపాడు, శ్యామరాజుపురం, ముటుకూరు, ఆత్మకూరు గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో గ్రామస్థులను సమావేశ పరచి సమావేశం నిర్వహించారు. ఎస్పి మాట్లాడుతూ అసాంఘీక శక్తులను అణచివేస్తామని, చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని ప్రజలను కోరారు. ఓటర్లను భయభ్రాంతులకు, బెదిరింపులకు పాల్పడే వ్యక్తులు తమకు అందజేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలలో కేంద్ర బలగాలు రప్పించి బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో వెబ్ సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎన్నికలు కొనసాగుతాయన్నారు. పోలింగ్ బూత్‌లో అక్రమాలు చోటుచేసుకున్న వివరాలు తమకు వెంటనే తెలిసిపోయి సంబంధిత వ్యక్తుల పై చట్టపరంగా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రధాన పార్టీ నాయకులు, గ్రామాలలో ఇబ్బందులుంటే తమకు సమాచారమందించి ప్రశాంత ఎన్నికల వాతావరణానికి సహకరించాలని పార్టీ నాయకులను కోరారు. అక్రమ మద్యం, డబ్బు తరలింపు చర్యలకు పాల్పడే వ్యక్తుల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే మరోమారు ఎన్నికల తేదీ లోపు గ్రామస్థులను కలిసి సమస్యలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. స్థానిక పోలీసు అధికారుల సహకారంతో ఎన్నికలు పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో గురజాల డిఎస్‌పి పల్లపురాజు, కారంపూడి సిఐ చిన మల్లయ్య, దుర్గి ఎస్ఐ ఎస్ కోటయ్య, సర్పంచ్‌లు గొంది నాసరయ్య, నలబోతు చిన్నబ్బాయ్, జానకి రాము, రామచంద్రయ్య యాదవ్, ఊరిబండి అంజయ్య, నాయకులు తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువులకు సాగర్ జలాలు

మాచవరం : వేసవిలో మంచినీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ఉండేలా ప్రభుత్వం నాగార్జునసాగర్ కుడి కాల్వ ద్వారా నీటిని విడుదల చేసింది. మండలంలో ఎన్‌ఎస్‌పీ ఆకురాజుపల్లి మేజర్ పరిధిలోని కొత్తగణేశునిపాడు, పిల్లుట్ల, మల్లవోలు, మాచవరం, తురకపాలెం గ్రామాల్లోని చెరువులను సాగర్ జలాలతో పూర్తి స్థాయిలో నింపారు. ఈ ఏడాది తీవ్ర వర్షాబావ పరిస్థితులు నెలకొనడంతో చెరువులు, వాగులు, కుంటలు ఎండిపోయి భూగర్భ జలాలు తగ్గిపోతున్న సమయంలో, చెరువులకు జలకళ రావడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు నిండడంతో పశువులు, మూగజీవాల దాహార్తికి నెల రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు హర్షం చేస్తున్నారు.

నాగులేరు పరివాహ గ్రామాల్లో నీటి ఎద్దడి



నీరు లేక ఎండిపోయిన నాగులేరు



కారెంపూడి సమీపంలో నీరులేక ఎండిపోయిన నాగులేరు మడుగు

కారెంపూడి : నాగులేరు పరివాహ ప్రాంతంలోని గ్రామాల్లో పాక్షిక నీటి ఎద్దడి నెలకొంది. తాగు నీటి అవసరాల నిమిత్తం చెరువులు, కుంటలు నింపుకునేందుకు సాగర్ కుడి కాల్వకు నీరు విడుదల చేసినా నాగులేరు వాగు ఒడ్డున ఉన్న 15 గ్రామాలలో చెరువులు, కుంటలు లేకపోవడం వల్ల నీటి సమస్య పరిష్కారం కాలేదు. నాగులేరుకు నీరు విడుదల చేస్తేనే భూగర్భ జలాలు పెరిగి తమ గ్రామాల్లో ఉన్న బోర్లలో నీరు వస్తుందని, నల్లమల కొండ ప్రాంతం నుంచి తంగెడ వద్ద కృష్ణానదిలో కలిసే చోటు వరకు నాగులేరు మడుగుల్లో నీరు లేక ఎండిపోయాయి. నాగులేరుకు కుడికాల్వ ద్వారా నీరు విడుదల చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది. దీంతో మేతకు వెళ్లిన పశువులకు, ఇతర జీవాలకు నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. నాగులేరు పరివాహ ప్రాంతంలో ఉన్న కాచవరం, ఇనుపరాజుపల్లె, గాదెవారిపల్లె, బట్టువారిపల్లె, తదితర గ్రామాలలో పాక్షిక మంచినీటి ఎద్దడి నెలకొంది. స్థానిక వినుకొండ రోడ్డు బ్రిడ్జి ఆక్విడెట్ వద్ద ఉన్న ఎస్కేప్ ఛానల్ ద్వారా నాగులేరుకు నీరు విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని జిల్లా ఉన్నతాధికారులను ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, మే నెలలో ఈ ప్రాంతంలో మంచినీటి సమస్య తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది.

నాగులేరుకు నీరు విడుదల చేయాలి

కారెంపూడిలో ప్రస్తుతం బోర్లలో నీరు సరిగా రాక నీటి ఎద్దడి నెలకొంది. బోర్లలో నీరందక మోటార్లు కాలిపోతున్నాయి. గ్రామంలో మంచినీరు సరిగా పంపిణీ చేయలేకపోతున్నాం. కారెంపూడికి ప్రత్యేకంగా చెరువు లేదు. నాగులేరు గంగధారి మడుగుతో పాటు దిగువన ఉన్న మరో పెద్ద మడుగే ఆధారం. నాగులేరుకు నీరు విడుదల చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

– రమావతు ప్రమీలాభాయి,
సర్పంచ్, కారెంపూడి

పశువులకు చుక్క నీరు దొరకడం లేదు

నీటి ఎద్దడి వచ్చినప్పుడు నాగులేరుకు గతంలో నీరు విడుదల చేసేవారు. కాని ప్రస్తుతం నీరు విడుదల చేయకపోవడం వల్ల పొలంలో ఎక్కడా పశువులకు చుక్క నీరు దొరకడం లేదు. గ్రామాల్లో కూడా బోర్లలో నీరు సరిగా రావడం లేదు. వేసవిలో నీటి ఎద్దడి అధిగమించడానికి తప్పకుండా నాగులేరుకు నీరు విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

– మందాళ్ల అంజిరెడ్డి,
మాజీ సర్పంచ్, పెదకొదమగుండ్ల

ఉపవాసంతో క్రీస్తుని ప్రార్థించాలి



ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో అన్నదానం

దాచేపల్లి : ప్రతి ఒక్కరూ ఉపవాసంతో క్రీస్తుని ప్రార్థించాలని పాస్టర్ తగరం ప్రేమయ్య అన్నారు. ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శుక్రవారం ఉపవాస ప్రత్యేక ప్రార్థన జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ ప్రేమయ్య మాట్లాడుతూ ప్రతి విశ్వాసికి ప్రార్థన ఎంతో విలువైందని, క్రీస్తు ద్వారా మేలు పొందాలంటే తప్పని సరిగా ఉపవాసంతో ప్రార్థించాలన్నారు. క్రీస్తు బోధనలు అచరించి వాటి ప్రకారం నడుచుకోవాలని, పాపాలను విడిచిపెట్టి పరిశుద్ధంగా జీవించాలని ఆయన చెప్పారు. అనంతరం ది మదర్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగెండ్ల సుమతీ రత్నం, సంఘస్థుల సహకారంతో ఉపవాసం ఉన్న ప్రతి ఒక్కరికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు నాగెండ్ల రత్నం, నాగెండ్ల యాకోబు, మాతంగి రాంబాబు, పత్రా ఆనందరావు, నాగెండ్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ తనిఖీ

విజయపురిసౌత్ : రాష్ట్రంలో జరగనున్న ఎన్నికలలో భాగంగా నెల్లూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నోడల్ డిప్యూటి కమీషనర్ హేమంత నాగరాజు పల్నాడు జిల్లా విజయపురిసౌత్ ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్‌లో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఎటువంటి మద్యం రవాణా జరగకుండా చూడాలన్నారు. ఏ రాజకీయ పార్టీలకు కొమ్ము కాయకుండా నిష్పక్షపాతంగా మద్యం అక్రమ నిల్వలపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సాగర్ సెబ్ చెక్‌పోస్ట్‌లో నమోదు చేసిన కేసుల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట మాచర్ల సెబ్ స్టేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ కె పి కిశోర్, విజయపురిసౌత్ సెబ్ చెక్‌పోస్ట్ అధికారి ఎం రవీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

పిడుగురాళ్లను మోడరన్ టౌన్‌గా తీర్చిదిద్దుతా

గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



జానపాడు రోడ్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతానని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. జానపాడు రోడ్డులోని వ్యాపార సముదాయ ప్రాంతంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గురజాల నియోజక వర్గంలోని పిడుగురాళ్ల మున్సిపాలిటీలో ఇప్పటికే అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, భవిష్యత్‌లో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ చేశామని, ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు చిరువ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చేశామన్నారు. బైపాస్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జిని కూడా పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం జరిగిందన్నారు. పట్టణంలో ఇప్పటికే సగానికి పైగా గృహాలకు ప్రతి ఇంటికీ కృష్ణా జలాలు అందించేలా కొళాయిలు ఏర్పాటు చేయటం జరిగిందని, మిగిలిన వాటికి కూడా పనులు జరుగుతున్నాయని, వచ్చే ఏడాదిలోగా శుద్ధి చేసిన కృష్ణా జలాలు అందుతాయన్నారు. జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ. 52 కోట్లు నిధులు మంజూరు చేయించామని, ఇప్పటికే పనులు మొదలయ్యాయని, వచ్చే 18 నెలల్లో బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తవుతుందన్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చెరువులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడంతోపాటు వ్యాయామశాలను నిర్మించడం జరిగిందని, రూ.11 కోట్లతో పార్కు నిర్మించబోతున్నామన్నారు. రైల్వే స్టేషన్‌ను రూ.19 కోట్లతో ఆధునీకరణ చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ సిబ్బంది కోసం తహశీల్దార్ కార్యాలయం నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే మొదటి నిర్మాణం పూర్తయిందన్నారు. మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించామని, రెండు పూర్తయి వైద్య సేవలు అందిస్తున్నాయన్నారు. పిడుగురాళ్ల పట్టణానికి కూత వేటు దూరంలోనే 600 పడకల వైద్యశాల, మెడికల్ కాలేజీ, నర్సింగ్ స్కూల్ తీసుకువచ్చామని, త్వరలో డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, నర్సరావుపేట పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భవనాశి యల్లారావు, డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్ , ఎండీ బాబర్, టీస్టాల్ నిర్వాహకుడు రాఘవ, కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, నూనె యాకోబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

పాలువాయి జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



రెంటచింతల : మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ (ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె. పాపయ్య నేతృత్వంలోని బృందం శుక్రవారం వాహనాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ 13 నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా తనిఖీలు చేపడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పరిమితికి (రూ.10 వేలు) మంచి నగదు, మద్యం, బంగారం, వెండి, తదితర విలువైన వస్తువుల తరలింపును నియంత్రించేందుకు చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో ఎవరైనా ఎన్నికల నియమ నిబంధనలకు వ్యతిరేక పనులకు పాల్పడుతున్న విషయం తెలిసిన వెంటనే సి–విజిల్ యాప్ ద్వారా మా బృందానికి సమాచారం అందించాలని ఆయన కోరారు.

మల్లవోలులో 21 మంది వలంటీర్లు రాజీనామా



మాచవరం : మండలంలోని మల్లవోలు గ్రామ సచివాలయ పరిధిలోని 21 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు అందిస్తున్న సేవలను చూసి ఓర్వలేక తెలుగు దేశం పార్టీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి, వలంటీర్ల వ్యవస్థపై అక్కసు వెళ్లగక్కిందని విమర్శించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి తోడుగా ఉండేందుకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



పార్టీలో చేరిన వారితో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి : బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధితో పాటు ఇతర సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ముటుకూరు గ్రామ టీడీపీకి చెందిన పది కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పిఆర్కే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంది నాసరయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, రామిశెట్టి బాబురావు, పుట్టా మారుతి, జిల్లెలమూడి శేషయ్య, జాస్తి రామ్మూర్తి, కేసంశెట్టి పెద అంజయ్య, పులిమెల భాస్కర్, కొల్లి హనుమయ్య, కట్టబోయిన రవి తదితరులున్నారు.

టీ తయారు చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



పిడుగురాళ్లలో టీ కాస్తున్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల : ఎన్నిక ప్రచారంలో భాగంగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పిడుగురాళ్లలోని జానపాడు రోడ్డులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

జానపాడు రోడ్డులోని రాఘవ టీస్టాల్ వద్ద సామాన్యుడిలాగా ప్రజలతో మమేకమై టీ స్టాల్‌లో టీ తయారు చేశారు. అనంతరం ప్రజలతో కూర్చుని సామాన్యుడిలాగా టీ తాగారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

అసిస్టెంట్ ఆర్‌ఓ జి రజనీకుమారి



ఓటర్ చైతన్యరథయాత్ర లో పాల్గొన్న అసిస్టెంట్ ఆర్‌ఓ జి రజనీకుమారి

దుర్గి : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అసిస్టెంట్ ఆర్‌ఓ జి రజనీకుమారి అన్నారు. శుక్రవారం ఓటర్లను చైతన్యం చేస్తూ సాగుతున్న ఓటరు చైతన్య రథయాత్ర మండల కేంద్రమైన దుర్గి చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చయాలన్నారు. పోలింగ్ రోజును సెలవు దినంగా భావించి ఓట్లు వినియోగించుకుని ఓటరు ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడుస్తున్నట్లే భావించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జిఎల్ఎస్ గుప్తా, డిటీఏ ఫణీంద్ర, విఆర్‌ఓలు టి జీరయ్య, కోటేశ్వరరావు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం సచివాలయ వలంటీర్లు రాజీనామా

దుర్గి : మండలంలోని ధర్మవరం సచివాలయ వలంటీర్లు రాజీనామా చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జిఎల్ఎస్ గుప్తాకు 12 మంది వలంటీర్లు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శివకుమార్, పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు.

కన్నెగంటిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు పూజల రామయ్య



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు పూజల రామయ్య

రెంటచింతల : స్వాతంత్ర్య సమరయోధుడు, పుల్లరి ఉద్యమకారుడు కన్నెగంటి హనుమంత్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు పూజల రామయ్య అన్నారు. శుక్రవారం కన్నెగంటి హనుమంత్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి రామయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. తెల్ల దొరల గుండెల్లో వణుకు పుట్టించిన తొలి తరం విప్లవ యోధుడు కన్నెగంటి హనుమంతు అని కొనియాడారు. పలనాడు ప్రాంత పుల్లరి ఉద్యమంలో, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో హనుమంత్ చిన్న వయస్సులోనే చురుకుగా పాల్గొని బ్రిటిష్ వారి చేతిలో వీర మరణం పొంది పల్నాటి ప్రజల హృదయాల్లో ఆరాధ్యుడుగా చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కన్నెగంటి సేవా సంఘం అధ్యక్షుడు, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్. మోహన్, మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పూజల వెంకట్, పల్లెర్ల కేశవరెడ్డి, నాళం చినబాబు, గాదె లూర్దు మర్రెడ్డి, ఆకుల నర్శింహారావు తదితరులున్నారు.

కారెంపూడిలో పిన్నెల్లి తల్లి రాములమ్మ ప్రచారం



మేమంతా సిద్ధం అంటున్న పీఆర్కే తల్లి రాములమ్మ, సోదరి నాగమణి

కారెంపూడి : పల్నాటి వీర్ల అంకాలమ్మ దీవెనలు పొందిన అనంతరం వైఎస్సార్‌సీపీ మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తల్లి పిన్నెల్లి రాములమ్మ, పీఆర్కే సోదరి జవ్వాజి నాగమణి పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామి, శివాలయంలో పూజల అనంతరం పూజారి వాసు ఇంటి నుంచి ఎన్నికల ప్రచారాన్ని పీఆర్కే తల్లి రాములమ్మ, సోదరి నాగమణి ప్రారంభించారు. అంకాలమ్మ గుడి బజారు నుంచి బ్రహ్మనాయుడు మేడ బజారులో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ బొమ్మిన సావిత్రి, జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు ప్రమీలభాయి, వైఎస్సార్‌సీపీ మండల మహిళా కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ, మండల ఎలక్షన్ ఇన్‌ఛార్జి దోర్నాల సాంబిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, బొమ్మిన అల్లయ్య, కొమ్ము చంద్రశేఖర్, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, చీతిరాల కోటేశ్వరరావు, అంతరగడ్డ ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మేలు చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి



ఎన్నికల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి

మాచర్ల : సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు ఎంతో మేలు చేశారని, అలాంటి ప్రభుత్వాన్ని ఎన్నుకుని వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకష్ణారెడ్డి సతీమణి పిన్నెల్లి రమాదేవి అన్నారు. శుక్రవారం మాచర్ల బస్టాండ్ సెంటర్‌లోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద, రింగురోడ్డులోని షాపులు, వ్యాపారులు, తోపుడు బండ్లు ఓటర్లందరినీ కలుసుకొని ప్రచారాన్ని నిర్వహించారు. కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.